


# నవభూమి

## జిల్లా అనుబంధం

19 సెప్టెంబర్,2024 గురువారం పేజీలు:7

www.epaper.navabhoomi.in


## మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి

# అండగా ఉంటాం

- క్షతగాత్రులకు మెరుగైన వైద్య అందించండి
- మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చట్టాలు తేవాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





**పాల్వంచ సెప్టెంబర్ 18 నవభూమి ప్రతినిధి:** ములకలపల్లి మండలం, సీతారాంపురం గ్రామం వద్ద విద్యార్థులను తీసుకొని వెళ్తున ఆటోను, మద్యం సేవించి కారు నడుపుతూ డీ కోట్టిన ప్రమాదంలో ఒక్క విద్యార్థి మృతి చెందగా, ఆటో డ్రైవర్ తో సహా నలుగురు విద్యార్థులు గాయపడ్డావిషయం తెలిసిందే. ప్రమాద విషయం తెలుసుకున్న కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి, డిసిహెచ్ఎస్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్, సీఐ వినయ్ కుమార్ లను ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన విద్యార్థి ఈశ్వర్ కుటుంబాన్ని ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య అందించాలని, వైద్య అధికారులను ఆదేశించారు. మద్యం సేవించి, వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణం అవుతున వారి పై మరింత కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో కూనంనేని వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ సీతరాములు, సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, మైనారిటీ రాష్ట్ర నాయకులు నయీమ్ ఖురేషి లతో పాటు సీపీఐ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.





## కలెక్టరేట్ ఉద్యానవనంలో

# కూలిన ఓ అవినీతి వృక్షం

- ఫైల్ కలెక్టర్ కు పంపేందుకు లంచం డిమాండ్
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ లో రూ.1లక్ష 14 వేలు లంచం
- ఏసీబీ కి పట్టుబడ్డ జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి సూర్యనారాయణ
- నోట్ల కట్టలు లేనిదే ఫైలు కదిలే పరిస్థితి లేదు

4






**కొత్తగూడెం సెప్టెంబర్ 18 నవభూమి ప్రతినిధి:** సరైన అజమాయిషీ లేకపోవడంతో జిల్లాలో కొందరు అధికారులు గుండెలు తీసిన బంటుల్లా తయారయ్యారు. కలెక్టరేట్ లో కొలువై ఉండే కార్యాలయంలో లంచం తీసుకునేందుకు వెనుకాడటం లేదు. నోట్ల కట్టలు లేనిదే ఫైలు కదిలే పరిస్థితి లేకుండా పోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇందుకు ఉదాహరణగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్లో హార్టికల్చర్, సెరికల్చర్ జిల్లా అధికారి కే. సూర్యనారాయణ ఒక బిల్లు సర్టిఫై చేసి,కలెక్టర్ వద్దకు ఫైల్ పంపేందుకు లక్ష 14 వేల రూపాయలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీకి పట్టుపడ్డాడు. డ్రిప్ కంపెనీకి చెందిన వ్యక్తి వద్ద నుండి రూ.1లక్ష 14వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సూర్యనారాయణ ను కలెక్టరేట్లో ఆయన కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. గతంలో ఇదే అధికారి మహబూబాబాద్ పనిచేశారు. సదరు కంపెనీ మహబూబాబాద్ జిల్లాలో రైతులకు సబ్సిడీ పై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు సరఫరా చేసింది.ఈ జిల్లా లో కూడా చేస్తోంది.

# సింగరేణిలో హైడ్రా!

- అవినీతి, అక్రమాలకు సింగరేణిలో స్థానం లేదు
- అవినీతి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి
- నాణ్యత పాటించని అధికారులు,
- కాంట్రాక్టర్లు, ఏజెన్సీలపై కూడా కఠిన చర్యలు
- సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు
- విజిలెన్స్ విభాగంపై సమీక్షలో సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ స్పష్టీకరణ





**కొత్తగూడెం సెప్టెంబర్ 18 (జమీల్ అహ్మద్ / నవభూమి ప్రతినిధి):** సింగరేణి సంస్థ పూర్తి పారదర్శకంగా, అవినీతి రహితంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కొంతమంది అక్రమార్కులు అమాయకులైన కార్మికుల్ని మోసం చేస్తున్నారని తెలుస్తోందని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ హెచ్చరించారు. ఇప్పటికే మెడికల్ బోర్డు పేరిట అక్రమాలకు తావు లేకుండా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ, నేర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయించడం జరిగిందన్నారు. ఇటీవల మెడికల్ బోర్డు ప్రక్రియలో దళారులపై సీఐడీ నివేదిక ఇచ్చిన తర్వాత, దీని ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే మెడికల్ బోర్డు సహా కంపెనీకి నష్టం కలిగించే పనులు చేస్తున్న ఉద్యోగులు, ఇతరుల సమాచారాన్ని కంపెనీ విజిలెన్స్ విభాగానికి 9491144104 నెంబరులో లేదా vig@scclmines.com మెయిల్కు ఆధారాలతో పంపించాలని సూచించారు. అక్రమార్కులపై కచ్చితమైన సమాచారాన్ని ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు వారికి రూ.10 వేల ప్రోత్సాహక బహుమతిని కూడా ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి బుధవారం విజిలెన్స్ శాఖ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో అవినీతి అక్రమాలకు స్థానం లేదని, అక్రమార్కులపై విజిలెన్స్ శాఖ గట్టి నిఘాను ఉంచాలని, కార్మికులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అవినీతిని అరికట్టడంలో సహకరించాలన్నారు.

కారుణ్య ఉద్యోగ నియామక ప్రక్రియలో సింగరేణి ఉద్యోగులు అవినీతికి పాల్పడినట్లు తేలితే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, ఇతరులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అందజేసి అన్ ఫిట్ అవుతున్న వారికి కంపెనీ ద్వారా లభించే టర్మినల్ బెనిఫిట్స్ను నిలిపివేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనారోగ్య కారణాలతో బాధపడే వారి కోసమే కారుణ్య నియామక ప్రక్రియ ను అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. సింగరేణిలో ఏటా కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టు పనులు జరుగుతున్నాయి, వీటి నాణ్యతపైన కూడా విజిలెన్స్ నిఘాను పెట్టాలని సీఎండీ ఆదేశించారు. కాంట్రాక్టు పనుల్లో నాణ్యత పాటించని పక్షంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. పకడ్బందీగా ఎక్స్ టర్నల్ పరీక్షల నిర్వహణ.. ఫలితాల విడుదల. సింగరేణి సంస్థ చరిత్రలోనే తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత ఉద్యోగ నియామక పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఇందులో 272 ఎక్స్ టర్నల్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును కూడా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే మిగిలిన 327 పోస్టుల ఫలితాలను విడుదల చేయనున్నట్లు చెప్పారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆస్తులు, క్వార్టర్లను పరిరక్షించడం అందరి బాధ్యత అని సీఎండీ ఎన్.బలరామ్ చెప్పారు. దీన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్క ఉద్యోగి కృషి చేయాలన్నారు. సింగరేణి ఆస్తులు, క్వార్టర్ల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం నుంచి జీఎం(విజిలెన్స్) ప్రసాదరావు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

## వరదలను ఎదుర్కొనేందుకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి

6

# సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే సారధులు



**ఎరుపాలెం,నవభూమి, సెప్టెంబర్ 18 :**వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే సారధులు అని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య పేర్కొన్నారు.ఎర్రుపాలెం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభను నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీరయ్య మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి అసువులు బాసిన అమరవీరులను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అన్నారు.తెలంగాణ రైతంగ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది కమ్యూనిస్టులు ప్రాణాలర్పించావాలని తెలిపారు.దొరల గడీల నుంచి ప్రజలను విముక్తి చేసి భూస్వాముల చర నుంచి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులుదని అన్నారు.సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్య మాలను నిర్మించాలని అమరవీరుల ఆశయ సాధన కొరకు యువత కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో గామాసు జోగయ్య,కూడెల్లి నాగేశ్వరరావు,గవరాజు రాములు,కోలా నాగేశ్వరరావు,ఎడ్లపల్లి కాశేశ్వరరావు,కోలా రాములు,బొగ్గుల సత్యంబాబు,భూసిపల్లి కృష్ణారెడ్డి,వేముల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి




**ఏనుకూరు, నవభూమి, సెప్టెంబర్ 18 :** గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్దె భవనాలు, అరకొర సౌకర్యాలను పరిష్కరించాలని,ఆ శాస్త్రీయమైన పాఠశాల పని వేళలను సవరించాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవకాశాలు కల్పించాలని, అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుదర్శన్ రావు, వేమురాజు, సునీల్, శ్రీనివాస్, విశ్వేశ్వరరావు, లక్ష్మి విజయ్ కుమారి,రజిని, జమున రాణి, చైతన్య,అనిల్, ధర్మ, తదితరులు పాల్గొన్నారు

# 9 మందిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు: మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి వెల్లడి

**మణుగూరు సెప్టెంబర్ 18 నవభూమి ప్రతినిధి:** మణుగూరు మండలం రాజీవ్ గాంధీ నగర్ లో నివాసముంటున్న మర్రి రజిత వైఫ్ ఆఫ్ సురేష్ ,(లేటు) కులం ఎస్సీ మాల తీసుకున్న అప్పు కట్టలేదని అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆమె ఇంటిపై దాడి చేసి ఒక మోటార్ బైక్ ఇంట్లో సామాన్లు తీసుకొని వెళ్తుండగా అడ్డుకున్న ఆ మహిళను కొట్టడంతో పాటు కులం పేరుతో దూషించారని సదరు మహిళ ఫిర్యాదు చేయగా 9 మంది వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని డిఎస్పి రవీందర్ రెడ్డి తెలిపారు

## 30న ఉస్మానియా యూనివర్సిటీలో పిడిఎస్‌యు

# 50 వసంతాల స్వర్ణోత్సవ సభ

**టేకులపల్లి సెప్టెంబర్ 18 నవభూమి ప్రతినిధి:** భారత విద్యార్థి ఉద్యమాలకు పి డి ఎస్ యు దిక్సూచిలా నిలిచిందని,50 ఏళ్లలో విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ, విద్యార్థుల హక్కుల కోసం, శాస్త్రీయ విద్య సాధన, సమసమాజ స్థాపనే ధ్యేయంగా పోరాడిందని పి.డి.ఎస్.యు. జిల్లా కార్యదర్శి కార్యదర్శి కాంపాటి పృథ్వీ తెలిపారు. బుధవారం టేకులపల్లి మండల కేంద్రంలో పి.డి.ఎస్.యు. 50 వసంతాల స్వర్ణోత్సవాల గోడ పత్రికలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. పృథ్వీ మాట్లాడుతూ నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ ప్రతిఘటన పోరాటాల ప్రేరణతో, కత్తుల వంతెనపై నెత్తుటి కవాతు చేసిన పి.డి. ఎస్.యు. 50 యేండ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎందరో విద్యార్థి రత్నాలైన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్, రంగవల్లి, చేరాలు, రమణయ్య, సాంబయ్యలు తమ వేడి నెత్తురును ధార పోశారని గుర్తు చేశారు. పి డి యస్ యూ ఆవిర్భావం నాటినుండి అధిక ధరలు, అధిక ఫీజులు, ఆశ్రిత పక్షపాతం, అవినీతి, కుల వివక్షత, మతోన్మాదానికి వ్యతిరేకంగా, మహిళలపై దాడులు, సంక్షేమ హాస్టల్స్ సమస్యలపై, పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్, యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేపట్టిందని తెలిపారు. ఈ క్రమంలో 50 ఏళ్ల తర్వాత కూడా భవిష్యత్ తరాలకు మరింత




ఉత్తేజాన్ని కలిగిస్తూ పి.డి. ఎస్.యు. పోరాటాలను కొనసాగిస్తుందని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, సంఘటితంగా ఉద్యమించాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. 30న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పి డి యస్ యూ 50 వసంతాల సభకు విద్యార్థులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి డి యస్ యూ జిల్లా నాయకులు బి.సాయి, ఈసం ప్రణీత్, రాజ్, హరీష్, సంతోష్, సంధ్య, శ్రావణి, నిరోష తదితరులు పాల్గొన్నారు.

# జమలాపురం అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాశన

**ఎర్రుపాలెం, సెప్టెంబర్ 18 నవభూమి ప్రతినిధి:** మండల పరిధిలోని జమలాపురం గ్రామ ఎస్సీ కాలనీలోని అంగన్వాడి -1 కేంద్రలలో పోషణ్ అభియాన్ కార్యక్రమంను ఐ సిడిఎస్ సి డి పి ఓ కృష్ణ శ్రీ, ఎర్రుపాలెం సెక్టార్ సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలోబుధవారం ఘనంగా నిర్వహించారు. పోషణ ఆహార మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ముగ్గురు చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం టీచర్ ఎం లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింత లకు,చిన్నారులకు, గర్భిణీలకు అందుతున్న ప్రయోజనాలను సద్వినియోగంచేసుకోవాలన్నారు.గర్భిణీలు,బాలింతలు, చిన్నారులు పోషక ఆహారం తీసుకోవాలని అన్నారు. గర్భిణీలు రక్తహీనత లేకుండా పోషక ఆహారం తీసుకోవాలన్నారు.కౌమార దశలో చిన్నారులు తీసుకోవలసిన పౌష్టికాహారం,రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత,బాలల పరిరక్షణ విభాగం సేవలు, బాల్య వివాహాలు గురించి వివరించారు.చిన్నారులను బరువులు తీసి వారికి బహుమతులు అందించారు.పోషక విలువలు కలిగిన వివిధ రకాలైన



పిండివంటలను అంగన్వాడి సెంటర్ సిబ్బంది తయారుచేసి ప్రదర్శించారు.ఈ కార్య క్రమంలో పల్లె దవాఖాన వైద్యులు కుమారి,సాయి రెడ్డి,గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఉయ్యూరు మల్లిక,ఇమేలమ్మ,ఆశ కార్యకర్త సునీత, అంగనవాడి టీచర్ లక్ష్మి, ఆయా శాంతమ్మ, చిన్నారులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చిన్నారుల సహాయ స్ఫూర్తి ప్రశంసనీయం

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- "నా ఖమ్మం కోసం నేను" స్ఫూర్తితో
- సమతా సూపర్ జెమ్స్ స్కూల్ 35 వేల విరాళం
- విద్యార్థుల 35 వేల రూపాయల విరాళాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం నవభూమి బ్యూరో, సెప్టెంబర్ 18:** చిన్నతనం నుంచి ఇతరులకు సహాయం చేయాలనే మంచి హృదయంతో ఖమ్మం వరద బాధితుల కోసం చిన్నారులు చూపించిన సహాయ స్ఫూర్తి ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనియాడారు. వరద బాధితుల సహాయార్థం జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు నా ఖమ్మం కోసం నేను అనే నినాదంతో కొణిజెర్లకు చెందిన సమతా సూపర్ జెమ్స్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని,



విద్యార్థులు సేకరించిన 35 వేల రూపాయల విరాళాన్ని చెక్ రూపంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించిన విద్యార్థుల సహృదయాలను ప్రశంసించారు. వరద బాధితులకు మనం అందించే సహాయం డబ్బు, వస్తువు రూపంలో వారికి సహాయ పడటమే కాకుండా విపత్కర సమయంలో సమాజంలోని ప్రజలంతా కలిసి మనకు సహాయం చేస్తున్నారనే ఆత్మస్థైర్యం బాధితుల్లో పెరుగుతుందని, వరద బాధితుల సహాయార్థంపై స్కూల్ విద్యార్థులు ఆలోచించడం మంచి విషయమని కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. చిన్నతనం నుంచే సమాజం పట్ల అవగాహన కల్పిస్తూ, పిల్లలు సామాజిక కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను అభినందించారు. ఇతరులకు సహాయం చేయాలనే ఉద్దేశం చిన్నప్పటి నుంచే పిల్లలలో మనం నాటాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొంతం ఉమాశంకర్, ఉపాధ్యాయులు కంచేటి ప్రవంతి, సంజాల సాయి, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


# వరద బాధితులను గుర్తించడంలో ప్రభుత్వం విఫలం

## బిఆర్ఎస్ నాయకులు రంగాపురం బాలకృష్ణ గౌడ్



తిరుమలాయపాలెం నవభూమి సెప్టెంబర్ 18- తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దాదాపు 20 కి పైన ఇండ్లు వరద తాకిడికి గురై ఇళ్లలోకి నీళ్లు వచ్చి వడ్లు, బియ్యం మరియు సామాన్లు తడిచి ఆర్థికంగా నష్టపోయారు, కానీ ప్రభుత్వం మరియు స్థానిక శాసనసభ్యులు ప్రకటించిన అర్హుల జాబితాలో రాజారం గ్రామం నుంచి ఐదుగురు లబ్ధిదారులను ఎంచుకోవడం ఆశ్చర్యం కలిగించింది అలాగే మండలంలో కూడా ఇలాగే జరిగిందని తెలుస్తుంది కావున మళ్లి విచారణ చేసి అర్హులైన అందరి లబ్ధిదారులకు ప్రభుత్వపరంగా సహాయం అందించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

# ఎర్రుపాలెం నుండి హైదరాబాద్‌కు బస్సు సర్వీస్ ప్రారంభం




ఎర్రుపాలెం, నవభూమి, సెప్టెంబర్ 18: మండల ప్రజల కోరిక మేరకు డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో మండల కేంద్రం ఎర్రుపాలెం నుండి హైదరాబాద్ ప్రగతి నగర్ వరకు బుధవారం నుండి బస్ సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శంకర్రావు తెలిపారు.మధిర ఆర్టీసీ బస్సు డిపో నుండి సూపర్ లగ్జరీ బస్సు ప్రతిరోజు రాత్రి 9:30 గంటల సమయంలో బయలు దేరుతోందని శంకర్రావు తెలిపారు.ఈ బస్ సర్వీస్ ను ఎర్రుపాలెం మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ బస్సు ను జమలాపురం నుండి బయలుదేరే విధంగా ఏర్పాటు చేస్తే జమలాపురం,వెంకటా పురం, నారాయణపురం, కాచవరం, సత్యనారాయణ పురం,రాజుపాలెం,నరసింహ పురం, బంజర, కండ్రిక, తెల్లపాలెం గ్రామాల ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు. అధికారులు దీనిపై పునరాలోచన చేసి జమలాపురం నుండి బయలుదేరే విధంగా ఏర్పాటు చేయాలని ఈ గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

# క్రీడాకారులకు క్రీడ సామాగ్రి అందజేత






ఎర్రుపాలెం, నవభూమి, సెప్టెంబర్ 18 : మండల పరిధిలోని మీనవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లక్కిరెడ్డి పుల్లారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు లక్కిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి (ఎన్నారై) పాఠశాల విద్యార్థులకు సుమారు 15వేల రూపాయల విలువైన క్రీడా దుస్తులను, క్రీడా సామాగ్రిని అందజేశారు.విద్యా వాలంటీర్ గా పని చేస్తున్న కటారపు వెంకటేశ్వర్లుకు ఆర్థిక సహాయంగా నిడమానూరు సత్యనారాయణ 10,000 రూపాయలను మాజీ సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీ మోహన్ రావు, వ్యాయామ ఉపాధ్యా యులు సత్యనారాయణ రెడ్డి,సొసైటీ చైర్మన్ కుడుముల మధుసూదన రెడ్డి,వైస్ చైర్మన్ షేక్ జానీ భాష,ముక్కర సందీప్ రెడ్డి, మారపోగు జమలయ్య, షేక్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు నాగభూషణ్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



జూలూరుపాడు, సెప్టెంబర్ 18 ( నవభూమి) ఖమ్మం జిల్లా ఎన్ ఆర్ ఐ ఫౌండేషన్ పదవ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధ వారం బాలికలకు సుమారు యాభై వేల రూపాయల విలువ గల పది సైకిళ్లను పంపిణీ చేశారు.క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు.ఎన్ ఆర్ ఐ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ బండి నాగేశ్వర రావును పాఠశాల ఉపాధ్యాయురాలు శాంత కుమారి సంప్రదించి దూర ప్రాంతాల నుంచి వస్తున్న బాలికల ఇబ్బందిని వివరించారు.స్పందించిన నిర్వాహకులు పది మంది విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేసి దాతలు రవి దేవి శెట్టి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ భూమిలో పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పన,విద్యార్థులకు అవసరమైన వస్తు సామాగ్రి అందజేస్తున్న ఫౌండేషన్ వారి సేవలను కొనియాడి అభినందించారు.ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయురాలు శాంత కుమారి బాలికలకు పది సైకిళ్ళు అందజేయుట లో ఆమె ప్రత్యేక కృషి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సిపిఐ మండల కార్యదర్శి గుండెపున్ని వెంకటేశ్వర్లు, సి పి ఎం పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్,సిపిఐ ఎం ఎల్ కార్యదర్శి బానోత్ ధర్మా, బి యస్ పి మండల అధ్యక్షులు తంబర్ల నరసింహా రావు,తాళ్లూరి లక్ష్మయ్య,బొల్లి లక్ష్మయ్య,పాఠశాల సిబ్బంది రామిశెట్టి శ్రీనివాస రావు,నిమ్మగడ్డ ఉమా,రామనాధం,ప్రతాపరెడ్డి, శకుంతల,లలిత,సునీత,పటేల్,ప్రసాద్, తది తరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వితరణ




కొత్తగూడెం సెప్టెంబర్ 18 నవభూమి జిల్లా బ్యూరో: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పాండురంగారావు బంధువులు ఏవీ సుబ్రహ్మణ్యం, అనిత (బెంగళూరు) పదమూడు వేల రూపాయల విలువ చేసే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యా నగర్ విద్యార్థులకు షూస్, టై, బెల్టులు అందజేశారు. అలాగే కోతులు, పిల్లులు రాకుండా పాఠశాల కిటికీలకు ఐరన్ మెష్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సెక్రటరీ సురేష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల మౌలిక సదుపాయాలు కొరకు, విద్యార్థులకు కావలసిన నోట్ బుక్స్, షూస్, టై, బెల్టులు సభ్యుల ఆర్థిక సహకారంతో ప్రతి సంవత్సరం అందించడం జరుగుతుందని, అలాగే గతంలో ఈ పాఠశాలకు బెంచీలు, టేబుల్స్ ఏర్పాటు చేసిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు ఇటీవల స్వర్గస్తులైన సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ పాఠశాలకు గౌరవాధ్యక్షులు నీరుకొండ హనుమంతరావు గత పదిహేను సంవత్సరాల నుండి అనేక వసతులు కల్పించడంలో చాలా కృషి చేశారని, అలాగే ముందు ముందు కూడా విద్యార్థులకు అసోసియేషన్ అండగా వుంటుంది అని వివరించారు. కార్యక్రమంలో సభ్యులు అంజనానందం, వెంకటప్పయ్య, సాయిబాబా, శ్రీధర్, ధర్మారావు, కామేశ్వరరావు, విజయమోహన్, మైనేని నాగేశ్వరరావు, మోహన్ లాల్, సోందుబాబు, గురుమూర్తి, నారాయణ గార్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం తక్షణమే పత్తి మిరప రైతులను ఆదుకోవాలి

■ బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి



తిరుమలాయపాలెం, నవభూమి సెప్టెంబర్ 18 - ఇటీవల కురిసిన తుఫాన్ కారణంగా మండలంలోని పత్తి పంటలు బాగా దెబ్బతిన్నాయి వర్షాలకు పత్తి పంట పుతరాలిపోవడంతో తొలి దశ పంట వర్షార్పణం అయిపోయినట్లేనని రైతులు ఆందోళన . కనీసం ఇప్పుడైనా రైతు భరోసా ఇవ్వాలి అని . బిఆర్ఎస్ నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పత్తి పంట నీరు పట్టి ఎదుగుదల లేకుండా పోవడంతో ఆశించిన పంట వచ్చే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు పంట నష్టాలను పరిశీలించడానికి అధికారులు గ్రామాలకు రాకపోవడంతో రైతులు వాపోతున్నారు ప్రస్తుతం పత్తి పంట పక్షికంగా దెబ్బతిన్నప్పటికీ ఈ ప్రభావం పంట చివరి దశలో రైతులు నష్టాలు చూడాల్సి వస్తుందని ఈ విషయం అధికారులకు తెలిసిన పట్టించుకోవడంలేదని రైతులు అంటున్నారు

**పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు**

రెండు ఎకరాల్లో పత్తి పంట వేశాను ఇప్పటికీ 50 వేలు పెట్టుబడి పెట్టాను తుఫాన్ కారణంగా కనీసం పెట్టుబడి డబ్బులు కూడా వస్తాయో రావు అని ఆందోళనగా ఉంది మరోవైపు గతంలో “ రైతు బంధు “ రైతులకు పెట్టుబడి కోసం ఉపయోగపడే ప్రస్తుతం అది కూడా లేదు ఇంతవరకు ఒక అధికారి కూడా రైతుల పొలాలు ఎలా ఉన్నాయో చూసేందుకు రాలేదు.. శ్రీను, రైతు

**రైతులను నిర్లక్ష్యం చేస్తే ఎలా**

ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తే ఎలా మా పంటలు జరిగిన నష్టాలు ఇప్పుడు కనిపించకపోవచ్చు పంట చివరి దశలో ఎకరాలకు రావలసిన దిగుబడి రాదు అప్పుడు రైతు ఎంత నష్టపోయాడో తెలుస్తుంది ప్రస్తుతం పాక్షికంగా దెబ్బతిన్నట్లు కనిపిస్తున్నాయి రైతుల ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ఎదురు చూస్తున్నాం పంటలన్ని పాడైపోయాయి రైతులు అప్పుల పాలయ్యారని తక్షణమే ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటను సర్వే చేయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నేటి నుండి మండల స్థాయి పాఠశాలల క్రీడలు ప్రారంభం



ఎర్రుపాలెం,నవభూమి, సెప్టెంబరు 18: మండల స్థాయి పాఠశాలల క్రీడలు నేడు గురువారం నుండి ప్రారంభంఅవుతున్నాయని ఎర్రుపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు,మండల క్రీడల కన్వీనర్ జీవీఎన్ రాజు బుధవారం తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల ఏజ్ గ్రూప్ 17,14 బాల బాలికల కబడ్డీ,ఖో ఖో, వాలీబాల్ స్పోర్ట్స్ క్రీడలు జరుగుతాయని,మొత్తం 300 మంది క్రీడాకారులు 15 మంది క్రీడల నిర్వహణ అధికారులు,వ్యాయామ ఉపాధ్యాయులు ఈ క్రీడలలో భాగస్వామ్యులు అవుతారని తెలిపారు.ఈ పోటీలు గురువారం, శుక్రవారం జరుగుతాయని ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అవుతారని తెలిపారు.ఇటీవల ఎర్రుపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు పెరుమాళ్ళ శ్రీను అనారోగ్యానికి గురై మృతి చెందటంతో ఆయన పేరున ఎస్ జిఎఫ్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎరుపాలెం ఎంఈఓ వై ప్రభాకర్ ప రి శీ ల కు లు గా వ్యవహరించనున్నారు.

# గురుకుల పాఠశాలలో సమస్యలు తెలుసుకున్న ప్రత్యేక అధికారి



**ఏనుకూరు, నవభూమి, సెప్టెంబర్ 18:** గురుకుల విద్యాలయాన్ని బుధవారం మండల ప్రత్యేక అధికారి ఆర్.సాయినాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వంటగది, భోజనశాల, తరగతి గదులను, డార్మెంటరీ, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం ఎలా ఉంటుంది, రుచిగా ఉంటుందా లేదా,ప్రతిరోజు వంటకాలు ఏమేమి వండుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు . అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి పాఠశాల సమస్యలను వివరించారు. ప్రహరీ గోడ, భోజనశాల, డార్మెంటరీ, మూత్ర శాలలు, మరుగుదొడ్లు సరిపడా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ రమేష్, ఎం పి ఓ నారాయణస్వామి, పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ వార్డెన్ విశ్వేశ్వరరావు, ఏటీపీ సునీల్, వేము రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిజెపి నాయకుల దిష్టిబొమ్మ దగ్ధం



**పాల్వంచ సెప్టెంబర్ 18 నవభూమి ప్రతినిధి:** లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ, శివసేన పార్టీ నాయకుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఏఐసిసి ఆదేశాల మేరకు బుధవారం అంబేద్కర్ సెంటర్ లో పాల్వంచ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బీజేపీ నాయకుల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు ఏడవల్లి కృష్ణ, రంగా రావు, జలీల్, సురేష్ బాబు, రవి గౌడ్, కిషోర్, వీరయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఉద్యానవనంలో కూలిన ఓ అవినీతి వృక్షం

**(1వ పేజీ తరువాయి)** రైతు చేలో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అమర్చిన తరువాత హార్టికల్చర్ అధికారులు ధృవీకరించాల్సి ఉంటుంది.ఇలా ధ్రువీకరించి ఆ ఫైలు కలెక్టర్ వద్దకు పంపేందుకు బిల్లులో రెండు శాతం కమిషన్ గా ఇవ్వాలని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గతంలో మహబూబాబాద్ లో సైతం పనిచేసినప్పుడు బిల్లులో తన పర్సంటేజ్ ఇవ్వలేదని దానికి సంబంధించి 85వేలు,ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో పనికి 29వేలు మొత్తం ఒక లక్షా 14వేలు ఇస్తేనే ఫైల్ కలెక్టర్ పంపుతానని సూర్యనారాయణ ఖరాకండిగా చెప్పి, ఫైల్ తొక్కి పెట్టారు. దీంతో సదరు కంపెనీ ఏసీబీని ఆశ్రయించింది. ఏసీబీ దాడి చేసి లంచం స్వీకరిస్తుండగా పట్టుకుంది. ఈ దాడిలో డి ఎస్పీ వై. రమేష్, సి ఐ లు శేఖర్, రామారావు, హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు. ఏసీబీ చురుకుగా ఉందని ఎవరు లంచం ఇవ్వొద్దని తమ టోల్ ఫ్రీ నెంబర్ 1064 ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు

# సంక్షేమ బోర్డు కార్మికుల హక్కు ఇన్సూరెన్స్ కంపెనీలను అనుమతించవద్దు

- భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఏసి డిమాండ్
- కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల ధర్నా




**పాల్వంచ సెప్టెంబర్ 18 నవభూమి ప్రతినిధి:** సంక్షేమ బోర్డు కార్మికుల హక్కు అని, ఇన్సూరెన్స్ కంపెనీలను అనుమతించ వద్దని పేర్కొంటూ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆద్వర్యంలో దర్నా చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏఓ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భం జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సీఐటీయు అధ్యక్షులు కె బ్రహ్మాచారి, భవన నిర్మాణ కార్మిక సంఘం ఇఫ్టు రాష్ట్రనాయకులు ఉపేందర్ రావు, ఇఫ్టు బిల్డిగ్ వర్కర్స్ జిల్లా అద్యక్షులు తోడేటినాగేశ్వరరావు, ప్రగతి శీలబిల్డిగ్ వర్కర్స్ యూనియన్ ఇఫ్టు జిల్లా నాయకులు ఆర్ మధుసుదన్ రెడ్డి లు మాట్లాడుత కేంద్ర బీజేపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ లను అమల చేసే ప్రకియలో భాగంగానే సంక్షేమబోర్డులో ఇన్సురెన్స్ కంపెనీలకు ప్రవేశం కల్పిస్తున్నారని నాయకులు విమర్శించారు. కాంగ్రెస్, బీజేపి లు పరస్పరం విమర్శించుకుంటున్నారే కానీ, ఆచరణలో మాత్రం రెండు ప్రభుత్వాలు కార్మిక వ్యతేరేక విధానాలను అమలు చేస్తూన్నాయని విమర్శించారు. బీజేపి, కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం ఉదృతం చేయాలని విజ్ఞప్తిచేశారు. నిర్మాణ రంగ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమబోర్డును కార్మికులకు దూరం చేస్తున్న ప్రభుత్వ చర్యలను పోరాటం ద్వారానే ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను, ప్రభుత్వము ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలని నిర్ణయించడాన్ని తప్పుపట్టారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులంతా సెప్టెంబర్ 23న హైదరాబాదులో జరిగే కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నాకు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు . కార్మికులకు రక్షణగా ఉన్న సంక్షేమ పథకాలను బోర్డు ద్వారానే అమలు చేయాలని డిమాండ్




చేశారు. ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత పాక్షిక అంగ వైకల్యాలకు ఇచ్చే నష్టపరిహారాల స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పటం అన్యాయమని, ఇది సంక్షేమ బోర్డును పూర్తిగా బలహీనపరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర చట్టం లోని కార్మిక అనుకూల విధానాలను అమలు చేయాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఆరు లక్షల 30 వేల రూపాయలు ఉన్న ప్రమాద మరణం పరిహారాన్ని, ఐదు లక్షల రూపాయలకు తగ్గించడం కార్మికులకు నష్టదాయకమైన చర్య అని జేఏసీ విమర్శించింది. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలకు నిధులు పెంచాలనిడిమాండ్ చేశారు. ప్రమాద మరణ పరిహారాన్ని 10 లక్షల రూపాయలకు, సహజ మరణం పరిహారాన్ని ఐదు లక్షల రూపాయలకు, వివాహం, ప్రసవాలకు ఇచ్చే కానుకను లక్షరూపాయలకు పెంచాలని డిమాండ్ చేసింది. కార్మికుల సంక్షేమం కోసం ఉద్దేశించిన సంక్షేమ బోర్డులో కార్మికుల నిధులను అడ్డగోలుగా దారిమళ్లిస్తున్నారని గత ప్రభుత్వం 1350 కోట్లు నిధులు అక్రమంగా దారిమళ్లించిందని, ఆ నిధులను తిరిగి సంక్షేమ బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ద్వారానే కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల అందరి దగ్గర సంతకాల సేకరణ నిర్వహించి, ముఖ్యమంత్రికి పంపించాలని కోరారు. ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నిధులను దూరం చేయటం సరైనదికాదని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవటానికే ఇన్సూరెన్స్ కంపెనీలను ఆహ్వా నిస్తుందని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. సెప్టెంబర్ 23న హైదరాబాద్ లో జరిగే దర్నాకు జిల్లానుండి పెద్ద ఎత్తున కార్మికులు తరిలిరావాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు దొడ్డా రవికుమార్, గుర్రం రాములు, సోమలింగం, ఇఫ్టు సంఘాల నాయకులు రమేష్, అభిమన్యం, మంకెన వెంకటేశ్వర్లు, గోనెలరమేష్, వై శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య

- కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

**ఖమ్మం నవభూమి సెప్టెంబర్ 18:** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అగ్రనేత పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పై బిజెపి అనుసరిస్తున్న తీరు అప్రజాస్వామికం అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా బిజెపి శివసేన నాయకులు చేస్తున్న ప్రకటనలు హింసను ప్రేరేపించే విధంగా ఉన్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం పాత బస్ స్టాండ్ సర్కిల్ నందు నాయకుల దిష్టి బొమ్మ ను దహనం చేయడం జరిగిందని అన్నారు. ఒక ప్రజాస్వామిక వాదిగా ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ పై బిజెపి బెదిరింపులకు పాల్పడుతుందని అని అన్నారు. శివ సేన ఎంపి ఒకరు రాహుల్ గాంధీ నాలుక కోస్తే 11లక్షల రూపాయలు బహుమానం ఇస్తానని ప్రకటించగా బిజెపికి చెందిన మాజీ ఎమ్మెల్యే తన్విధర్ సింగ్ రాహుల్ గాంధీ నువు బయటికి వస్తె చంపేస్తామని మీ నానమ్మ ఇందిర గాంధీ కి పట్టిన గతే నీకు పడుతుందని బహిరంగంగా ప్రకటించారని అన్నారు. ఇంత బహిర్గత వ్యాఖ్యలు చేసినా ప్రధాని మోడీ కానీ హెూం శాఖ మంత్రి అమిత్ షా గాని ఈ విషయంలో కనీసం స్పందించకపోవడం బిజెపి హింసా రాజాకీయల గుట్టు రట్టు అయిందని విమర్శించారు. బిజేపి తీరు మారక పోతే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రాహుల్ గాంధీ కి అండగా ఉండి బిజెపి అహింసా, అప్రజాస్వామిక విధానాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. మోడీకి, అమిత్ షా కు రాజ్యాంగంపై చిత్తశుద్ధి ఉంటే వ్యవస్థలను సజావుగా నడపాలని రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలను చేసిన నాయకులపై చర్యలు తీసుకొని పార్టీ నుండి బహిస్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద



ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు అనంతరం ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కి చెందిన కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టు రాహుల్ గాంధీ అతిపెద్ద టెర్రరిస్టు అని అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రజాస్వామ్య వాదిగా ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాహూల్ గాంధీ వెనుకాడరని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా మహిళా, మైనారిట,సేవాదళ్ అద్యక్షులు దొబ్బల సౌజన్య,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్ గౌడ్,సయ్యద్ గౌస్,కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, నగర కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేందర్, పల్లెబోయిన భారతిచంద్రం, ముడుముంతల గంగరాజు యాదవ్,షేక్ అబ్బాస్ భేగ్, బాణాల లక్ష్మణ్, అనిల్,ఏలూరి అనిల్, దొడ్డా ప్రవీణ్, జహీర్ భాయ్, జాని, గడ్డికొప్పుల ఆనంద్ రావు, గజ్జి సూర్యనారాయణ, కమతం రామక్రిష్ణ, బడేమియా, నూకారపు వేంకటేశ్వరరావు, గడ్డం వెంకటయ్య, మందపల్లి నాగమణి, ప్రతిభారెడ్డి, ఫరీద్ ఖాద్రి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## విజయవంతమైన ఆర్‌సిఎం మెడికల్ క్యాంపు





**జూలురుపాడు, సెప్టెంబర్ 18 (నవభూమి)** మండల కేంద్రం లో గల పునీత నిర్మల మాత దేవాలయం ఆర్ సి ఎం చర్చ్ ఆధ్వర్యంలో బుధ వారం జరిగిన మెడికల్ క్యాంపు విజయవంతమైనది. అనేక మంది రోగులు పరీక్షలు చేయించు కున్న వారికి రాయితీ పై మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ ప్రతి నెల మూడవ బుధ వారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని వెల్లడించారు. అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రధానంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత పరీక్షలు ఔషధాలు ఇస్తామని తెలిపారు. క్యాంప్ ఏర్పాటుకు సహకరించిన స్థానిక చర్చ్ ఫాదర్ శౌరి బందనాథం కు కృతజ్ఞతలు తెలిపారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **సిబ్బంది కొరత, అవసరాలు దశలవారీగా తీరుస్తాం**
- **కలెక్టర్ జితేష్ వీ పాటిల్**



**భద్రాచలం 18 నవభూమి ప్రతినిధి:** ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారితో మర్యాద పూర్వకంగా మెలగాలని కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. బుధవారం ఆయన ఏరియా ఆస్పత్రికిని సందర్శించి వార్డుల్లో కలియ తిరిగారు. అనంతరం సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలంలో ఉన్న ఏరియాఆస్పత్రికి మూడు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున రోగులు వస్తుంటారని, వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్యులంటే దేవుళ్ల తో సమానం అని, రోగుల పట్ల నిర్లక్ష్య దోరణి ప్రదర్శించకుండా స్నేహపూర్వకంగా, మర్యాదగా మెలగాలని చెప్పారు. ఈ సందర్భంగా సిబ్బంది కొరత, తదితరలాపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రామకృష్ణ అడగా, ఇప్పటికే ఇద్దరు గైనకాలజిస్టులు, మత్తు డాక్టర్ ను నియమించామని, మరి కొంతమంది వైద్యులతో పాటు సిబ్బంది కొరత ఉన్నందున దశలవారీగా నియమిస్తామని చెప్పారు. వీటితో పాటు ఇతర అవసరాలు కూడా తన దృష్టిలో ఉన్నాయని, వాటిపై కూడా దృష్టి సారించి త్వరలోనే వాటి ఏర్పాటు కృషి చేయనున్నట్లు చెప్పారు. అంతకుముందు



బూర్గంపాడు లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సందర్శించి హెల్త్ సెంటర్లో ఉన్న రోగులను పరీక్షించి అందుచున్న వైద్య సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం ప్రభావం వలన డెంగు మలేరియా విష జ్వరాలు ప్రగులుతున్నందున హెల్త్ సెంటర్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని, పనిచేస్తున్న సిబ్బంది 24 గంటలు రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని అన్నారు. ఐటీసీ వారు నిర్మించిన టాయిలెట్లను రోగుల కోసం వినియోగించుకోవాలని, హెల్త్ సెంటర్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వలన పాములు తేళ్లు సంచరిస్తూ ఉంటాయని అందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే పాములు తేళ్లకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. రోజు రోజుకి ఓపి పెరుగుతున్నందున తప్పనిసరిగా రోగుల యొక్క వివరాలు ఓపి రిజిస్టర్లు నమోదు చేయాలని, జ్వరాల తీవ్రతను బట్టి రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి టెస్టింగ్ పంపించాలని, డెంగ్యూ మలేరియా వ్యాధి నిర్ధారణ అయితే ఆ రోగి యొక్క వివరాలు తెలుసుకొని ఆ గ్రామంలోని ప్రజలకు తప్పనిసరిగా మెడికల్ క్యాంపు పెట్టి రక్త పరీక్షలు చేసి సరిపడా మందులు అందజేయాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో పనిచేస్తున్న సిబ్బంది యొక్క పనితీరు చాలా బాగుందని, ఇదే విధంగా సమయపాలన పాటించి రోగులకు సరైన వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ సమన్వయ అధికారి రవిబాబు, బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పర్యవేక్షకుడు ముక్తేశ్వరరావు , వైద్యులు, సిబ్బంది తదితరులున్నారు.

# బదిలీ అయిన గ్రామపంచాయతీ సెక్రటరీ రావూరి శివకు ఘన సన్మానం

- **ప్రజల సహకారంతోనే గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేశా**
- **సన్మాన గ్రహీత రావూరి శివ**
- **సెక్రటరీ సేవలు అభినందనీయం**
- **గ్రామ పెద్దల ప్రశంసలు**
- **మరో ఇద్దరికి ఘన సన్మానం**
- **నూతన సెక్రటరీ కిరణ్ కుమార్‌కు శుభాకాంక్షలు**










**ఖమ్మం రూరల్, నవభూమి, సెప్టెంబర్ 18:** మూడేళ్లపాటు ఆరెంపుల గ్రామపంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన రావూరి శివ దంపతులకు గ్రామ ప్రజలు బుధవారం ఘనంగా సన్మానించారు. ఆరెంపుల హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో సెక్రటరీ రావూరి శివ దంపతులకు బొకేలు, మెమెంటోలు, పూలమాలలు, శాలువాలతో గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. గ్రామపంచాయతీ సెక్రటరీగా పిన్నవయసులోనే విధుల్లో చేరినప్పటికీ స్థానిక ప్రజలతో, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, ఇది శాఖల పరిధిలోని ఉద్యోగులు, గ్రామపంచాయతీ సిబ్బందితో మమేకమై తనదైన శైలిలో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు అందుకోవడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారని కొనియాడారు. బదిలీలు, పదోన్నతులనేవి అధికారులకు సర్వసాధారణమని, సెక్రటరీ శివ ఇక్కడి నుండి బదిలీపై వెళ్లడం తమకు బాధగా ఉన్నప్పటికీ, విధుల్లో భాగంగా బదిలీపై వెళ్లిన చోట కూడా అక్కడి ప్రజల మన్ననలు కూడా పొంది ఉత్తమ అధికారిగా రికార్డుల సాధించాలని వారు ఆకాంక్షించారు. నూతనంగా వచ్చిన సెక్రటరీ కిరణ్ కుమార్ కూడా గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తారని గ్రామ పెద్దలు ఆకాంక్షిస్తూ వీడ్కోలు పలికారు. సన్మాన గ్రహీత రావూరి శివ మాట్లాడుతూ ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు నాయకుల సహకారం, గ్రామపంచాయతీ పాలకమండలి, సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగుల సహాయ సహకారాల వల్లే గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. ప్రజలు, గ్రామ పెద్దలు తన పట్ల చూపిన ప్రేమాభిమానాలను మూట కట్టుకొని వెళ్తున్నానని, మీ అనుబంధాన్ని ఎన్నటికీ మరువలేనని అన్నారు. ఇదే స్ఫూర్తితో బదిలీపై వెళ్లిన చోట కూడా పనిచేసే ప్రజల మెప్పు పొందుతానని స్పష్టం చేశారు. నూతనంగా వచ్చిన గ్రామపంచాయతీ సెక్రటరీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో ఆరింపుల గ్రామపంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అలాగే గ్రామంలో సుదీర్ఘకాలం పనిచేసే బదిలీపై వెళ్లిన ఏఎన్ఎం కే భాగ్యలక్ష్మి, ఇటీవల పదవి విరమణ పొందిన అంగన్వాడి ఆయా ఎన్ రుక్మిణమ్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మీసాల రామచందర్, గ్రామ పెద్దలు బండి భాస్కరరావు, బండి జగదీష్, మాజీ సర్పంచులు చింతమల్ల రవికుమార్, పద్మ, మాజీ ఉపసర్పంచ్ బండి సతీష్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ దావూద్, డీలర్ వల్లూరు కవిత, బండి ప్రకాష్ రావు, వల్లూరి సీతారాం రెడ్డి, బండి వెంకటేశ్వర్లు, రవికుమార్, పెరుమాళ్ళపల్లి సురేష్, చుంచు నారాయణ, పప్పుల వెంకటరమణ, షేక్ సలీం పాషా, మోతుకూరి శ్రీనివాసరావు, కృష్ణ, బాలకృష్ణ, మీసాల నాగయ్య, పెరమాళ్ళపల్లి రమేష్ బాబు, ఆశ వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైరా ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన విద్యుత్ శాఖ అధికారులు





**కారేపల్లి, నవభూమి, సెప్టెంబర్18:** విద్యుత్ శాఖ అధికారులు కారేపల్లి లోని భరత్ నగర్ కాలనీలో బుధవారం విద్యుత్ శాఖ ఏఈ విజయ్ కరెంటు పోల్ ఎస్టిమేషన్ వేశారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కారేపల్లి లో నీ భారత్ నగర్ కాలనీ పర్యటనలో మేదరీ వీరప్రతప్ (టోనీ) ఎమ్మెల్యే కి కరెంట్ పోల్స్, మంచి నీటి వ్యవస్థ, వర్ష బీభత్సానికి దెబ్బతిన్న ఇండ్లను వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ని కోరారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి కారేపల్లి లో ఏ పనులు చేయాలో తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల , అడ్డగోడ ఐలయ్య అడిగి తెలుసుకున్నారు . కారేపల్లి లో త్వరలో నీటి సమస్య కూడా పరిష్కారిస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ మజీద్ పాషా (షేరు) ,ఎండీ హనీఫ్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్న దానం: పాల్గొన్న నాలుగు వేలకు పైగా భక్తులు

**పాల్వంచ సెప్టెంబర్ 18 నవభూమి ప్రతినిధి:** వర్తకసంఘం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రుల మండపంలో బ్రహ్మాండంగా, అద్భుతమైన రీతిలో భక్తి, శ్రద్ధ లతో జరుపుకున్న సందర్భంగా బుధవారం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్న ప్రసాద కార్యక్రమంలో సుమారుగా నాలుగు వేలకు పైగా భక్తులు వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలవాది ప్రకాష్ మాట్లాడుతూ దైవ కార్యక్రమములో పాల్గొనుట ఆ దేవుని కృప ఉంటేనే జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమంలో పాల్గొని, దేవుని ఆశీస్సులు పొందాలన్నారు. దైవ కార్యక్రమంలో పాల్గొన్న వారి కుటుంబం అంతా బాగుంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవకమిటీ అధ్యక్షులు చలవాది ప్రకాష్, సెక్రటరీస్ గూడెపు శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, డోగిపర్తి సతీష్, కంటాల రిత్విక్, టి శ్రీనివాస్ ఉత్సవ కమిటీ మహిళా అధ్యక్షురాలు పెండ్యాల రోజాలక్ష్మి, కొప్పరపు వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.





# వరదలను ఎదుర్కొనేందుకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- 1077ను శాశ్వత టోల్ ఫ్రీ నెంబర్‌గా ఏర్పాటు
- విపత్కర సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరెన్ ఏర్పాటు
- సాధారణ పౌరులకు డిజాస్టర్ మేనేజ్మెంట్‌పై శిక్షణ







**(తాతా శ్రీనివాసరావు,నవభూమి,సెప్టెంబర్18:** భవిష్యత్తులో వచ్చే భారీ వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మనమంతా పకడ్బందీగా సన్నద్ధం కావాలని, వరదల సమయంలో పాటించాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం నగరంలోని మున్నేరు నది వరద ప్రభావిత ప్రాంతమైన కరుణగిరిలో పర్యటించి సెయింట్ జోసఫ్ మేజర్ సెమినార్ చర్చ్ హాల్ లో చర్చ్ క్రిస్టియన్ సంబంధిత యాజమాన్యం, అధికారులతో కలిసి ఇటీవల వచ్చిన వరద వల్ల కలిగిన నష్టాలు, భవిష్యత్తులో డిజాస్టర్ మేనేజ్మెంట్ కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. కరుణామయ అనాథ ఆశ్రమం, అంధుల, మూగవారికి సంబంధించిన జ్యోతి నివాస్ స్కూల్ ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు ఉన్న పరిస్థితి, నీరు ఏ స్థాయి వరకు వచ్చింది, ప్రాణ సంరక్షణకు తీసుకున్న చర్యలు, గతంలో ఈ స్థాయి వరదలు ఎప్పుడైనా వచ్చాయా, భవిష్యత్తులో వచ్చే వరదల వల్ల కలిగే నష్టాల నివారణ, వరదల సన్నద్ధతకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ'గంటల వ్యవధిలో కుంభవృష్టి వర్షం పడటం, పరివాహక ప్రాంతాల్లో ఉన్న చెరువులు, ప్రాజెక్టులు అప్పటికే నిండుకుండలా తయారు కావడం, పై నుంచి పెద్ద ఎత్తున వరద రావడం, లకారం చెరువు నిండి ప్రవహించడం మొదలగు కారణాల వల్ల మున్నేరు నదికి గతంలో ఎన్నడూ లేనంతగా భారీగా వరదలు వచ్చాయని, దాదాపు 40 అడుగుల మేర నీటి ప్రవాహం ఉందని, మొదటి అంతస్థు వరకు నీళ్ళు వచ్చాయని తెలిపారు. ఖమ్మం నగరంలో వచ్చిన భారీ వరదల నేపథ్యంలో అందుబాటులో ఉన్న బృందాలు, సిబ్బందితో ప్రజల ప్రాణాలు రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని, వరద సహాయక చర్యలను సైతం వీలైనంత మేర సమర్థవంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో సైతం ఇటువంటి వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వరదలు వచ్చినప్పుడు పాటించాల్సిన పద్ధతులపై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ రూపొందించుకొని దానిని కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. కరుణామయ ప్రాంతం పరిసరాలలో వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరెన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. వరదలు వస్తే ఎత్తైన ప్రాంతాలు ఏవి, ఏ భవనంలోకి వెళ్ళాలి, ఇక్కడ ఉన్న అంధుల పాఠశాల విద్యార్థుల తరలింపు బాధ్యత ఎవరు తీసుకోవాలి మొదలగు అంశాలకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలని కలెక్టర్ తెలిపారు. వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వరదలు వంటి విపత్కర సమయంలో వినియోగించేందుకు వీలుగా శాశ్వతంగా 1077 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆసక్తిగల సాధారణ పౌరులను ఎంపిక చేసుకుని విపత్కర సమయంలో ప్రజల ప్రాణాలు రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవసరమైన శిక్షణ అందజేసి వాలంటీర్లను సిద్ధం చేసేందుకు గల అవకాశాలను పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. వరదల సమయంలో ప్రజలను రక్షించేందుకు వీలుగా అవసరమైన సామాగ్రి, ఇతర బృందాలను ప్రభుత్వం తరపున సన్నద్ధం చేసుకుంటున్నా మని అన్నారు. ఖమ్మం నగర వ్యాప్తంగా ఉన్న కాల్వలను సమర్థవంతం గా నిర్వహించడం ద్వారా కొంత మేర వరద ప్రభావం తగ్గే అవకాశం ఉంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు త్వరగా కోలుకునే దిశగా అవసరమైన అన్ని రకాల సహాయ చర్యలను ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ పేర్కొన్నారు. వరదల వల్ల విద్యా సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి సంబంధించిన సర్టిఫికెట్లు త్వరగా అందించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రభుత్వం అందించే స్వశక్తి రుణాలు, స్వయం సహాయక సంఘాల రుణాలు, ముద్రా రుణాలు, ప్రధానమంత్రి ఉపాధి కల్పన రుణాలు వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అందజేసి ఆర్థికంగా స్థిరపడేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ వరద ప్రభావిత ప్రాంతాలైన కరుణామయ అనాథ ఆశ్రమం, జ్యోతి నివాస్ స్కూల్ ను పరిశీలించారు. వరదలు వచ్చినప్పుడు ఆశ్రమంలో పిల్లలను ఎలా తరలించారు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మ్రుణాళ్ శ్రేష్ఠ, ఖమ్మం రూరల్ తహసిల్దార్ రాంప్రసాద్, చర్చి రెక్టార్ జయరాజు, ఫైనాన్సు సుధాకర్, సోషల్ సర్వీస్ ప్రతినిధి సురేష్, కార్యదర్శి విజయ్ రీసెర్చర్ చార్లెస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

**కొత్తగూడెం సెప్టెంబర్ 18 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం, చుట్టు ప్రక్కల ప్రాంతంలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను భద్రాచలం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి ఒక మోటార్ సైకిల్ మరియు ఒక సెల్ ఫోన్ స్వాదినం చేసుకున్నారు. అద్దంకి రాఘవన్ అలియాస్ గౌతమ్, కోసలా మిథున్, (సారపాక, గాంధీ నగర్ ఒడియ క్యాంపు కి చెందిన ) ఇద్దరు, ఇంకో నలుగురు కలిసి నిలిపి ఉంచిన మోటార్ సైకిల్ ను మరియు సెల్ ఫోన్లను దొంగిలించి, దొంగిలించిన వాటిని అమ్ముకొని వచ్చిన డబ్బులుతో జల్సాలు కి పాల్పడుతున్నా దొంగలను పట్టుకొని వారి వద్ద నుండి బైక్ ను మరియు సెల్ ఫోన్ స్వాదినాపరుచుకొని ఇద్దరిని రిమాండ్ కి తరిలించి పరారిలో ఉన్న ఇంకో దొంగ గురించి గాలింపు చేస్తున్నారు. ఈ ముగ్గురు దొంగలు ని పట్టుకోవడం సహాయపడిన తోటి సిబ్బంది ని భద్రాచలం ఇన్స్పెక్టర్ సంజీవ రావు అభినందించారు.



# గుంతల మయమైన అంగన్వాడి ప్రాంగణం

## సామాజిక బాధ్యత తీసుకున్న ముదుగు ప్రవీణ్





**జన్నారం, నవభూమి :-** మండల కేంద్రంలోని గాంధీ నగర్ అంగన్వాడి కేంద్ర ప్రాంగణం గుంతల మాయమై గుంతలు గుంతలు గా మారి వర్షపు నీరు నిలుస్తోంది మండల బీజేవైఎం అధ్యక్షులు ముదుగు ప్రవీణ్ బుధవారం మొరం మట్టి పోయించి గుంతల మయమైన ప్రాంగణాన్ని చదును చేయించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం నీరు నిలవడంతో చిన్నారులకు కాలనీ వాసులకు ఇబ్బందికరంగా ఉంటుందని సామాజిక బాధ్యతగా తన వంతు కర్తవ్యం నిర్వహించనని అన్నారు.

# ఘనంగా భారత దేశ ప్రధాని జన్మదిన వేడుకలు



**మోమిన్పేట్ నవభూమి ప్రతినిధి–** మంగళవారం భారత ప్రధాని నరేంద్ర మోడీ 74వ జన్మదినం సందర్భంగా మోరంగపల్లి బిజెపి నాయకుల ఆధ్వర్యంలో మోరంగపల్లి గ్రామంలో దుర్గామాత టెంపుల్ ఆవరణలో కేక్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ప్రధాని మోడీ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో చేసుకోవాలని ఓబీసీ మోక్ష మండల్ వైట్ ప్రెసిడెంట్ మహేందర్ ఆధ్వర్యంలో దుర్గామాత టెంపుల్ వద్ద కేకు కటింగ్ చేసి మోడీ పుట్టినరోజు సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాచగోని నాగరాజు, సిహెచ్ రాజు, బి. మల్లేశం, కావాలి రాములు, ఆ. రాములు, దర్శన్, మాణిక్యం, పట్లోళ్ల మల్లారెడ్డి, పెద్ద గోల లక్ష్మయ్య పాల్గొని విజయవంతం చేశారు

# కెకె5 గనిలో కార్మికుడి మృతి

## సంతాపం తెలియజేసిన హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు




**మందమర్రి సెప్టెంబర్ 18 నవభూమి:** కెకె5 గని మ్యాన్ రైడింగ్ ప్రమాదంలో మరణించిన లక్ష్మణ్ కుటుంబానికి బుధవారం హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు.బుధవారం స్థానిక హెచ్ఎమ్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షులు జె శ్రీనివాస్ మాట్లాడారు. మృతుడికి రావాల్సిన అన్ని ఆక్సిడెంటల్ బెనిఫిట్స్ ఇవ్వాలని మేనేజ్ మెంట్ ను డిమాండ్ చేశారు.గని ప్రమాదంలో మరణించిన లక్ష్మణ్ మ్యాన్ రైడింగ్ ఆక్సిడెంట్ అయినప్పుడు పైకితీసుకరావడానికి కనీసం స్ట్రెచ్చర్ లేదని,అంబులెన్స్ వస్తే అందులో వైద్య సిబ్బందేలేదని మండిపడ్డారు.డిస్పన్సరీకి తీసుకెలితే డాక్టరు లేదని, అంబులెన్స్ దించకుండానే ఏరియా హాస్పిటల్ పంపించడం సింగరేణిలో ఎలాంటి సౌకర్యాలు కార్మికులకు కలిపిస్తున్నారో యువకార్మికులు గమణించాలని అన్నారు.యువ కార్మికులు సింగరేణిలో ప్రశ్నించేతత్వం ఉండాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి , సెంట్రల్ నాయకులు ఎర్ర శ్రీనివాసరెడ్డి , చొప్పరిరామస్వామి , ముఖేష్ , సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ పకడ్బందీగా చేపట్టాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ
- పోషక లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్
- అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై సమీక్ష నిర్వహించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్





**ఖమ్మం కలెక్టరేట్, నవభూమి, సెప్టెంబర్ 18:** అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సంక్షేమ శాఖ అధికారులతో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, మహిళా, స్త్రీ సంక్షేమ శాఖలో అమలవుతున్న వివిధ పథకాలపై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందుతున్న ఆహార పదార్థాలు, పోషకాహార లోపం, అతి తీవ్ర పోషకాహార లోపం గల పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖతో సమన్వయం చేసుకొని పోషకాహార లోపం పిల్లలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చేయవలసిన ప్రక్రియ గురించి సూపర్వైజర్లకు సూచనలు చేశారు. ప్రతి సూపర్వైజర్ ప్రతి నెల 20 అంగన్వాడి కేంద్రాలు సందర్శించాలని, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలపై అంగన్వాడీ టీచర్ కు ఎప్పటికప్పుడు మార్గ నిర్దేశం చేయాలని, అక్కడ జరిగే కార్యక్రమాల ఫోటోలు గ్రూపులో పోస్ట్ చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. సమీక్ష సమావేశాలు ప్రతి నెల మొదటి వారంలోనూ చివరి వారంలోనూ నిర్వహిస్తామని, ఇట్టి సమావేశాలకు పోషకాహారం లోపంతో ఉన్న పిల్లల పూర్తి నివేదిక, పోషకాహార లోపానికి కారణాల పూర్తి సమాచారంతో సమావేశాలకు హాజర అవ్వాలని సూపర్వైజర్లకు, సిడిపిఓలకు అదనపు కలెక్టర్ సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన కు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అంగన్వాడీ కేంద్రాల తనిఖీలు చేపట్టనున్నట్లు, అంగన్వాడీ కేంద్ర ఆయా, టీచర్లు అంగన్వాడీ కేంద్ర పని గంటలు ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు కేంద్రంలో వుండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న అంగన్వాడీ కేంద్రాల నష్టం పై పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సీడీపీవోలు, ఏసీడీపీవోలు, సూపర్వైజర్లు, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి విష్ణు చందన, తదితరులు పాల్గొన్నారు.

# మాతృమూర్తి భాగ్యమ్మ మృతదేహానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్

- వృద్ధాప్యంతో మృతి చెందిన టీచర్ భాగ్యమ్మ
- రాజేందర్ కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే రామచంద్రనాయక్





**కురవి సెప్టెంబర్ 17 నవభూమి:** కురవి గ్రామానికి చెందిన ప్రముఖ టీచర్ భాగ్యమ్మ ఇక లేరు వృద్ధాప్యంలో అనారోగ్యంతో మంగళవారం ఆమె మృతి చెందారు. ముందుగా పంతులమ్మ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఆమె కుమారుడు కురవి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేందర్ నారాయణ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. అయితే రాజేందర్ వారి తల్లిదండ్రులు విద్యాబోధన అందించే టీచర్లు కావడం గమనర్హం. ఎందరో విద్యావంతులను ఆమె తీర్చిదిద్దారనే పేరు ఉంది. ఆమె మృతితో పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రామచంద్రనాయక్ వెంట జిల్లా పార్టీ అధ్యక్షుడు భరత్ భరత్ చందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# లక్ష్మణ్ మృతిని గని ప్రమాదంగానే గుర్తించాలి-సీఐటీయూ

- ప్రభుత్వ పరంగా సహాయం ప్రకటించాలి



**మందమర్రి సెప్టెంబర్ 18 నవభూమి:** కెకె5 గని లో మృతి చెందిన లక్ష్మణ్ గని ప్రమాదంగానే గుర్తించాలని,ప్రభుత్వ పరంగా సహాయం ప్రకటించాలని గని కార్మికులు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)నాయకులతో ధర్నా నిర్వహించారు.అనంతరం సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ మంగళవారం రెండవ బదిలీలో లక్ష్మణ్ అనే కోల్ కట్టర్ కార్మికుడు విధులు ముగించుకుని మైన్ రైడింగ్ పై వస్తున్న సమయంలో మధ్యలో కింద పడిపోవడంతో వెనకనుంచి వచ్చే కార్మికులు అతనికి సహకరించి మీదికి తీసుకొచ్చే ప్రయత్నంలో అతను చనిపోవడం జరిగిందని తెలిపారు.అందుబాటులో స్ట్రక్చర్ కనుక ఉంటే తొందరగా పైకి తీసుకువచ్చే అవకాశాలు ఎక్కువ ఉండేదని ఆ లోపం గని యజమాన్యం గమనించాలని అన్నారు. కార్మికుడు అండర్ గ్రౌండ్ గని పరిధిలోనే చనిపోయినందున ఈ ప్రమాదాన్ని గని ప్రమాదంగా గుర్తించి వారికి వచ్చే టర్మినల్ బెనిఫిట్స్, బ్యాంక్ ద్వారా వచ్చే ప్రమాద బీమాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రభుత్వం తరుపున సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.